హైదరాబాద్ వార్త



## మౌలాలి, హైటెక్‌సిటీ వరకు త్వరలో
# ఎంఎంటీఎస్ రైళ్లు

తార్నాక, జనవరి 5 ప్రభాతవార్త: నగర వాసులు ఎన్నోసంవత్స రాలుగా ఎదిరి చూస్తున్న మౌలాలి, హైటెక్‌సిటీ ఎంఎంటీఎస్ రైళ్లు త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా మౌలాలి, సనత్‌నగర్ మధ్య నిర్మిస్తున్న రెండో లైన్ పనులను ఇప్పటికే అధికారులు పూర్తిచేశారు. దీంతో మౌలాలి నుంచి హైటెక్‌సిటీ మీదుగా లింగంపల్లికి ఎంఎంటీఎస్ రైళ్లు నడువనున్నాయి. దీంతో ఈ ప్రాంతం ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. ఈ రైళ్లు ఫిబ్రవరి నెలలో పట్టాలెక్కనున్నట్లు అధికారులు చెప్పారు. ఈ ప్రాంతం గుండా రైళ్ల ప్రారంభంతో ఈ ప్రాంతం నుంచి కేవలం 30 నిమిశాల్లో ఐటీ కంపెనీలకు వెళ్లే అవకాశం ఉంటుంది.

## రజాకార్ల ఆగ్రహానికి గురై హత్య చేయబడ్డారు

చిక్కడపల్లి, జనవరి 5 ప్రభాతవార్త: గతంలో పత్రికలకు రాజకీయాలు మధ్య సంబంధాలు సామాజిక ప్రయోజనాల కోసం ఉండేవని, నేడు ఆర్థిక అవసరాలు కోసంగా మార్పు చెందాయని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కుచట్టం పూర్వ చీఫ్ కమిషనర్ బుద్ధా మురళీ అన్నారు. శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా ప్రముఖ పాత్రికేయులు షోయబుల్లా ఖాన్ సంస్మరణ సభ త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన కళాసుబబ్బారావు కళావేదికలో శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బుద్ధా మురళీ మాట్లాడుతూ షోయబుల్లాఖాన్ పత్రికా రచయిగా నైజాం అరాచకానికి వ్యతిరేకంగా పోరాడి రజాకార్ల ఆగ్రహానికి గురై హత్య చేయబడ్డారని చెప్పారు. గతంలో గాంధీ, నేతాజీ, ప్రకాశం పంతులు ఎందరో స్వాతంత్ర సంగ్రామయోధులు పాత్రికేయరంగంలో ఉన్నారని, నైజాం పాలనలో షోయబుల్లాఖాన్ ఇమ్రోజ్ ఉర్దూ పత్రికను నడిపి నిరంకుశ పాలనను విమర్శిస్తూ భారత్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనం కావాలని వ్యాసాలతో చైతన్యం రగిలించారన్నారు.



సర్దార్ వల్లాబామ్ పటేల్ నేషన్ పోలీస్ అకాడమీ 42వ.ఆల్ ఇండియా పోలీస్ ఈక్విస్ట్రియన్ ఛాంపియన్‌షిప్ మౌంటెడ్ పోలీస్ డ్యూటీ మీట్ 2023లో గుర్రలపై చేస్తున్న ప్రదర్శనల దశ్యం



## మహేంద్రహిల్స్ దోబిఘాట్ పరిశీలన

కంటోన్మెంట్, జనవరి 5 ప్రభాతవార్త: మారేడ్‌పల్లి మండలం మహేంద్రహిల్స్‌లోని 844బై1లో రజకాభివృద్ధి సంస్థ దోబిఘాట్‌కు కెటాయించిన 1700 ఖాళీ స్థలాన్ని శుక్ర వారం సికింద్రాబాద్ ఆర్‌డిఓ రవి, మారేడ్‌పల్లి తహశీల్దార్ పి.పద్మ సుందరీలు పర్య వేక్షించారు. మహేంద్రహిల్స్‌లోని దోబిఘాట్‌కు కెటాయించిన స్థలం ఆక్రమణకు గురైందా, లేదా ప్రత్యేక్షంగా పరిశీలించారు. ఆ స్థలంలో ఉన్న దోబిఘాట్ నిరుపయోగకరంగా ఉందని పరిశీలించారు. అదే విధంగా దోబిఘాట్ కొనసాగితే వాటికి సరిపడు మంచి నీరు ఉందా, లేదా,బోర్‌వెల్స్ ఉన్నాయా లేవా పరిశీలించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సర్వే సింగ్, యువరాజులు పాల్గొన్నారు.

## మహిళలకు మేలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం

చిక్కడపల్లి జనవరి 5 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల మహిళలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పుస్తకాల కవిత అన్నారు. శుక్రవారం నగరంలోని ఇమ్లీబన్, జుబ్లీబస్‌స్టేషన్, ఇబ్రహింపట్నం బస్‌స్టేషన్‌లతో పాటు ఇతర ముఖ్య బస్‌స్టేషన్‌లను సందర్శించి మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన ఉచిత ప్రయాణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# ఫైయిల్ ఐతే కుంగిపోవద్దు: కలెక్టర్



యూసుఫ్‌గూడ స్త్రీ శిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దురుశెట్టి

యూసుఫ్‌గూడ, జనవరి 5, ప్రభాతవార్త : ఏ విషయం లోనైనా ఫెయిల్ అయితే కృంగిపోకుండా మరలా ప్రయత్నిస్తే తప్పక విజయం సాధిస్తారని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని కమిషనర్ స్త్రీ సంక్షేమశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి, వారి సిబ్బంది అక్కడ ఉన్న అనాధపిల్లలను ఇస్రో, చెన్నై, తదితర ప్రాంతాలకు విజ్ఞాన యాత్రకు తీసుకుని వెళ్లి వచ్చిన సందర్భంగా అనాధ పిల్లలతో కలెక్టర్ మాట్లాడుతూ పుస్తకాలు ఒకవైపు, విజ్ఞానయాత్రలు మరోవైపు విద్యార్థులకు ఎంతో తోడ్పాటు అందిస్తాయి. విద్యార్థులతో ఎప్పటికప్పుడు చర్చించటం వల్ల ఇలాంటి విజ్ఞాన యాత్రల వల్ల విజ్ఞానం వస్తుందని ప్రత్యక్షంగా చూడటం వల్ల ఆవిషయాలు ఎప్పటికీ మర్చిపోరని అవి మెదడులోనే నిక్షిప్తమై ఉంటాయని అన్నారు. ఇస్రోలోని శాస్త్రవేత్తలు కూడా చిన్నచిన్న పాఠశాలల్లో చదివివుంటారు కాని వారు దానిని చాలా ఇష్టంగా చదివి ఆస్తాయికి ఎదిగారని మనం కూడా ఇష్టంగా చదివితే ఆస్థాయి సాధించవచ్చు అన్నారు. ఏదైనా సాధించాలని పట్టుదల ఉంటే తప్పక సాధించవచ్చని అని అన్నారు.

**హైదరాబాద్,..** మనం శ్రద్ధ, ఆసక్తితో కృషి చేసినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తామని హైదరబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం కేశవ్‌మెమోరియల్ పాఠశాలలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావవేశం లో పదవ తరగతి పరీక్షా ఫలితాలపై సమీక్షించారు. ప్రతిప్రధానోపాధ్యాయుడు వందశాతం ఫలితాలు సాధిస్తామని నమ్మకంతో ఉంటే మంచి ఫలితాలు సాధించవచ్చునని ,విద్యార్థి 10వతరగతి పాస్ అయితేనే మెరుగైన జీవితాన్ని పొందుతాడని అన్నారు. హైదరాబాద్ పదోతరగతి ఫలితాలల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో సమానంగా ఎందుకు సాధించలేకపోతున్నామని ఆలోచించాలన్నారు. ప్రభుత్వం విద్యపై బాగానే ఖర్చు చేస్తున్నప్పటికీ దానికి తగిన ఫలితాలు రావట్లేదన్నారు.

# విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

**ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్**



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్

ముషీరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్సీ ఏ.నర్సి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కే.నాగేశ్వర్‌లు సూచించారు. శుక్రవారం దోమలగూడలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో నూతన సంవత్సర డైరీ మరియు కాలమానిని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కేజీ టు పీజీ హామీ ఇచ్చి, అమలుచేయకపోగా విద్యారంగానికి నిధులు కేటాయించకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. నూతన ప్రభుత్వం మానిఫెస్టోలో పేర్కొన్న విధంగా విద్యకు 15శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతరాలు లేని అభివృద్ధి నూతన ప్రభుత్వ లక్ష్యం కావాలని, విద్యా సంస్థల్లో, చదువుల్లో సమానత్వం సాధిస్తేనే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు. రకరకాల పేర్లతో చదువులోనే అడ్డుగోడల్లా అంతరాలున్నప్పుడు అది అందరికీ సమాన విద్యను అందించినట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావరవి మాట్లాడుతూ టీచర్ల పదోన్నతులలో సంక్షోభాన్ని నివారించా లని, పదోన్నతులకు టెట్ ను మినహాయించాలని లేదా కనీసం ఐదు సంవత్సరాల వరకు ఉత్తీర్ణులు కావాలనే నిబంధనను అయినా పెట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని, ప్రతి నెలా ఒకటవ తారీఖున వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధ్యక్షులు కే.జంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వ విద్య గత పది సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురయిందన్నారు. పాఠశాలలో అన్ని అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే ఖాళీలన్నీ భర్తీ చేసి, విద్యారంగాన్ని బాగు చేయాల్సిన బాధ్యత నూతన ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.లక్ష్మారెడ్డి, పి.మా ణిక్‌రెడ్డి, డాక్టర్ ఎల్.అరుణ, కమలకుమారి, ఏ.సింహాచలం, ఈ.గాలయ్య, ఎస్.వై.కొండల్‌రావు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల బాద్యులు కే.రాజారావు, శ్యాం, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లోగా కులగణన చేపట్టాలి

**29, 30 తేదీలలో 'చలో ఢిల్లీ' ఆందోళన**

**రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరిక**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సైఫాబాద్, జనవరి 5 ప్రభాతవార్త: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కల్పించాలని, పార్లమెంట్‌లో బిసి బిల్లు ప్రవేశపెట్టి సభల లో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29, 30 తేదీలలో 'చలో ఢిల్లీ' ఆందోళన కార్యక్రమం చేపడుతున్నామని 14 బిసి సంఘాలు హెచ్చరించాయి. ఈ ఆందోళనా కార్యక్రమంలో ఎపి, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది బిసిలు పాల్గొంటారని సంఘాల నేతలు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్‌లో బిసి బిసి బిల్లును ప్రవేశపెట్టి చట్ట సభలలో రిజర్వేషన్‌లు కల్పించాలని తమ సంఘం ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలలో పార్లమెంట్ ఎదుట 102 సార్లు ధర్నాలు చేపట్టడం, 66 సార్లు ప్రధాన మంత్రిని కలిసి చర్చలు జరపడం జరిగిందని, వందలాది మంది పార్లమెంట్ సభ్యులను, ప్రతిపక్ష నేతలను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగిందని, కేంద్రానికి 18 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించామన్నారు. కేంద్రం కేవలం రెండు డిమాండ్లు జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగ బద్ధమైన హోదా, కేంద్ర ఓబిసి రిజర్వేషన్లను వర్గీకరించడానికి అంగీకరించి జివోలు జారీ చేయడం జరిగిందన్నారు. ఇంకా అంగీకరించిన నాలుగు డిమాండ్లలో రెండు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, కేంద్ర బడ్జెట్‌లో బిసి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పూర్తిస్థాయి ఫీజులు రీయంబర్స్‌మెంట్ పరిష్కారం కాలేదన్నారు.

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ అయితే బిసి కులగణన, పార్లమెంట్‌లో బిసి బిల్లు పెడతామని ప్రకటించే పార్టీకే బిసిల మద్దతు ఉంటుందని ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. కేంద్రం గత 76 సంవత్సరాలుగా బిసిలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులను అమలు చేయకుండా మోసం చేసిందని, బిజెపి ఓబిసి వర్గానికి చెందిన నరేంద్రమోదీని ప్రధాన మంత్రిగా చేసిందని, కాని దేశంలోని 75 కోట్ల మంది అభివృద్ధికి ఏలాంటి న్యాయం చేయలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా హెచ్.వెంకటేశ్వరిని నియమించారు. ఈ సమావేశంలో బిసి నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, కోట్ల శ్రీనివాస్, వేముల రామకృష్ణ తదితరుల పాల్గొన్నారు.

## చిన్నచిన్న కారణాలకే
# ఆత్మహత్యలు



- మానసిక ఒత్తిడిలో యువత!
- భవిష్యత్తుపై విశ్వాసం లేకపోవడంతో అటువైపు
- ఆత్మహత్యలకు
- పాల్పడేవారిలో 15-30 ఏళ్ల వారే అధికం
- పలు తాజా అధ్యయనాల్లో వెల్లడి




ప్రతి చిన్నదానికి ఆత్మహత్యే..
ఉరుకుల పరుగుల జీవితం నగరాల్లో ఎక్కువగా కనబడుతోంది. ఉదయం నిద్ర లేచిన కాన్నుంచి రాత్రి మళ్లీ నిద్రపోయే వరకూ అంతా బీజీ లైఫ్. పని భారం, ఒత్తిడి, ఇతర సమస్యలతో సతమతమవుతుంటారు. మానసిక రుగ్మత కేసులు నగరంలో ఎక్కువగా నమోదవుతున్నాయి. మరీ ముఖ్యంగా హైదరాబాద్ లాంటి మెట్రో నగరాల్లో ప్రతీ ఏటా మానసిక రుగ్మతలు ఎక్కువగానే పెరుగుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పరీక్షలో ఫెయిల్ అయ్యారని, ర్యాంక్ రాలేదని, అమ్మ తిట్టిందని, నాన్న కొట్టాడని, ప్రేమ విఫలం అయ్యిందని, భార్యభర్తల గొడవలు ఇలాంటి ప్రతి చిన్న దానికి సైతం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రపంచంలో ప్రతి 40 సెకండ్లకు ఒకురు మరణిస్తున్నారని అంచనా.

హైదరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త : డిప్రెషన్ (మానసిక కృంగుబాటు) ఈ మాటను అంతగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే దాదాపుగా ప్రతి ఇద్దరిలో ఒకరు ఏదో ఒక సమస్య కారణంగా మానసిక సంఘర్షనలలో పడి కొట్టుమిట్టాడుతూ ఉంటాడని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. దీనికి కారణం అనేకం ఉండవచ్చు. కుటుంబ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, వృత్తి పరమైన సమస్యలు, మన చుట్టూ ఉండే పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు, సామాజిక, ఆర్థిక ఇబ్బందులు లాంటివి. ఈ సమస్యలతో బాధపడే వారూ.. కొంత మంది పైకి కనబడుతారు...మరి కొంత మంది తమ లోలోపలే ఈ సమస్య గురించి బాధపడుతూ కుంగి, కృషించి నలగిపోతూ ఉంటారు. సమస్య గురించి ఎవరికి చెప్పక, వైద్యం తీసుకోక సమస్య ముదిరి బాగా డిప్రెషన్‌కు లోనై చివరికి ఆత్మహత్యకు దారితీసే పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని దశాబ్దాలుగా సమాజం, ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన అనారోగ్య స్థితి. చివరకి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవం అంశంగా డిప్రెషన్‌ను ప్రకటించడంతో అందరి దీష్టి అనివార్యంగా దీనిపైకి మళ్లిందనే చెప్ప వచ్చు. మానసికి కృంగు బాటు వ్యక్తిని నిస్సహాయుడిగా, బ్రతుకు భారంగా అనిపించి మానసిక వేదనలో మునిగిపోయేలా మార్చివేస్తోంది. వారి పరిస్థితి అసలు వారికే అర్థం కాదు. చాలా కుటుంబాలు, సమాజమూ డిప్రెషన్‌కు గురై వారు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను అర్థం చేసుకోవటంలేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా సుమారు 35 కోట్ల మంది డిప్రెషన్‌తో బాధపడుతున్నారని తెలుస్తోంది. 15-30 వయసున్న వారు ఉద్వేగాలకు అత్యధికంగా లోనై మరణాలకు పాల్పడుతున్న కారణాల్లో రెండవది డిప్రెషనే. డిప్రెషన్ ద్వారా ఆత్మహత్యలు ప్రతీ ఏటా పెరుగుతునే ఉన్నాయి. 2014లో నేర విభాగంలో నమోదైన గణంకాలు పరిశీలిస్తే తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యల రేటు 26.5గా నమోదైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆత్మహత్యలు అత్యధికంగా నమోదవుతున్న మొదటి 10రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం ఒకటిగా ఉండడం ఆందోళన కల్గించే విషయం. ఆత్మహ్యాతకు ప్రయత్నించడం, ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఉండడం, ఆత్మహత్య, స్వీయహానీ తలపెట్టుకోవడం వంటి ఆలోచనలు డిప్రెషన్‌కు చెందిన తీవ్రమైన పరిణామాలని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. ప్రతి 10 మందిలో ఇద్దరు ఏదో ఒకరకమైన మానసిక అనారోగ్యం బాధపడుతుంటారని వచ్చే పదేళ్లలో ఇంకా ఎక్కువగా ఉంటారని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది.



**ఈ లక్షణాలు ఉన్నాయంటే వారు మానసిక సమస్యతో బాధపడుతున్నట్టే లెక్క**

దీర్ఘకాలం పాటు నిరాశ, నిస్పృహ, విచారంతో ఉండటం. అలసటగా ఉండడం, శక్తి తగ్గిపోవటం. నిద్రలేమి, అతిగా నిద్రపోవటం, తెల్లవారకముందే నిద్ర లేవడం. ఏ కారణం లేకుండా బాధ, నొప్పులు, తిమ్మిరి, జీర్ణ సంబంధమైన సమస్యలుండటం. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన రావడం, తమను తాము శిక్షించుకోవడం. కార్యకలాపాలపై తగినంత శ్రద్ధను కోల్పోవటం. ఇలాంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వెంటనే వైద్యున్ని సంప్రదించాలి. దీంతో పాటు వ్యాయామం చేయాలి, మిమ్మల్ని మీరు ఒంటరిగా చేసుకోకండి, ఎక్కువ సమయం జనం మధ్యలో ఉండేటట్టు చూసుకోండి. నమ్మకమైన బంధువు, స్నేహితుండిపై విశ్వాసాన్ని కలిగి ఉండడం. ముఖ్యమైన నిర్ణయాలను వాయిదా వేసుకోండి. వైద్యనిపుణుల సలహాలు పాటించండి.

## ఆపదలో ఉంటే..
# అత్యాచారం చేశాడు

- తండ్రి అత్యాచారం చేశాడని
- ఓ బాలిక ఇన్‌స్టాగ్రామ్ స్నేహితుడితో మొర
- నమ్మించి తన రూమ్‌కు పిలిపించిన
- స్నేహితుడు మరో రెండురోజుల అత్యాచారం

కుత్బుల్లాపూర్, జనవరి 5 ప్రభాతవార్త : మోసం.. మోసం.. మోసం.. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్న ఓయువతి చివరిదశలో పోలీసులను ఆశ్రయించిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కుత్బుల్లాపూర్‌కు చెందిన తండ్రి తన కన్నకూతురు పైనే అత్యాచారం చేయడం ప్రారంభించాడు. ఈ విషయమై తన తల్లికి ఆ అమ్మాయి ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో దిక్కుతోచలేదు. ఇదేతరుణంలో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన సంతోశ్ అనేవ్యక్తి పరిచయం కావడంతో అతడికి తండ్రి తనపై చేసే అత్యాచారం విషయం వెల్లడించింది. ఇదే అదనుగా భావించిన సంతోశ్ అవకాశంగా తీసుకున్న సంతోశ్ ఆమెను తాను ఉంటున్న అమీన్‌పూర్‌కు ఆమెను రప్పించుకుని మొదట ధైర్యం చెప్పి అనంతరం ఆమెను నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. గత దీపావళి సందర్భంగా ఆ అమ్మాయికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన సంతోశ్‌తో ఈవిషయం పంచుకోగా సంతోశ్ తాను అమీన్‌పూర్‌లో ఉంటున్న రూమ్‌కు రప్పింకుని వివరలు తెలుసుకున్నాడు. ఇదే తరుణంలో తాగినమత్తులో సంతోశ్ సైతం ఈనెల 26నుండి 29వరకు ఆ అమ్మాయిపై అత్యాచారం చేశాడు. అక్కడి నుండి తప్పించుకుని తల్లిదండ్రుల వద్దకు వచ్చి జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తల్లి,తండ్రుల సహాయంతో జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించి తనకు జరిగిన అత్యాచారంపై ఫిర్యాదు చేసింది.దీనితో పోలీసులు కేసు నమోదు చేసి బాదితుడికోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈమేరకు జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు విచారణ చేపట్టారు.

# జీడిమెట్లలో 86 కిలోల గంజాయి స్వాధీనం



విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లను చూపెడుతున్న జీడిమెట్ల పోలీసులు

కుత్బుల్లాపూర్, జనవరి 5 ప్రభాతవార్త : జీడిమెట్ల కేంద్రంలో ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు నిలువ వుంచిన గంజాయిని జీడిమెట్ల పోలీసులు స్వాదీనం చేసుకుని నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ గ్రామ సమీపంలోనివెంకటేశ్వరనగర్ కేంద్రంలో గంజాయి విక్రయాలను నిర్వహిస్తున్న వ్యక్తుల సమాచారం పోలీసులు సేకరించారు. వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఓ అపార్ట్‌మెంట్ లో నివాసముంటున్న వెంకట సాయిక్రిష్ణ(33) పెంట్‌హౌస్‌లో వుంటు గతకొంతకాలంగా గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. విశాకపట్నం నుండి జెసిబి టైర్లలో నింపి బొలేరో వాహనంలో గణేష్ అనే వ్యక్తితో గంజాయిని సరఫరా చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లోని పెంట్‌హౌస్‌పై దాడీచేయగా మొత్తం 86కిలోల గంజాయి స్వాదీనం చేసుకుని నిర్వాహకుడు వెంకట సాయికృష్ణను అదుపు లోకి తీసుకుని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. వైజాగ్ నుండి హైదరాబాద్‌కు సరఫరా అయిన గంజా యిని హైదరాబాద్ నుండి రాజస్థాన్‌కు తరలించేందకు సిద్దం చేసినట్లు నిర్వాహకులు వివరించినట్లు పోలీసులు తెలిపారు.

# రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపోలో వన భోజనం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 5 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపోలో శు క్రవారం వన భోజనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఎండి విసి సజ్జనార్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో రాష్ట్రంలో టాప్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండు దపాలుగా ఆర్టీసీ సిబ్బందికి వన భోజనం కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (పరిపాలన) కృష్ణకాంత్, హైదరాబాద్ రీజియన్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్, డిప్యూటీ మేనేజర్ (ట్రాఫిక్) విజయ్ బాను, డిప్యూటీ రీజియన్ మేనేజర్ (మెయింటెనెన్స్ జగన్, రాజేంద్రనగర్ డిపో మేనేజర్ ఎం.శ్రీనాథ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపోలో జరిగిన వన భోజనం కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఎండి విసి సజ్జనార్

## ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం కమిటిని వేయాలి

**తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం**



**సమావేశంలో అభివాదం చేస్తున్న డాక్టర్ చీమా శ్రీనివాస్**

సైఫాబాద్, జనవరి 5 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమ కారులు ఆత్మగౌరవం, సంక్షేమం కోసం కృషి చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి 'తెలంగాణ ఉద్యమ కారులు ఆత్మీయ బంధువు' అని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ధన్యవాద ములు తెలిపింది. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్ మాట్లాడుతూ అమరుల బలిదానాలతో, తెలంగాణ ఉద్యమ కారుల పోరాటాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఉద్యమ కారులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఉద్యమ కారుల ద్రోహిగా కెసిఆర్ మారి ఉద్యమ కారుల పేరును కూడా ఎత్తకుండా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమ కారుల ఆవేదనను అర్థం చేసుకున్న కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు తమ సంక్షేమం కోసం ఎన్నికల మ్యానిఫెస్టోలో 250 గజాల స్థలం, పెన్షన్ మంజూరు చేర్చడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 7వ తేదీ నుంచి 17 లోక్‌సభ నియో జవర్గాల్లో సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞత సభలను నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఉద్యమ కారులను గుర్తించడానికి ప్రభుత్వం ఒక కమిటిని వేయాలని, వారి సంక్షేమానికి 'సంక్షే మ బోర్డు'ను ఏర్పాటు చేసి 10 వేల కోట్ల బడ్జెట్ కేటాయిం చాలని, గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఉద్యమ కారులను తెలంగాణ స్వరాష్ట్ర సాధకులుగా గుర్తించాలని, పెన్షన్ సౌకర్యం, ఉచితంగా బస్, రైల్‌లో ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య కార్డుకు 20 లక్షల జీవిత బీమా, నిరుద్యోగ విద్యార్థులకు 50 లక్షలు వడ్డీలేని రుణాలు పంపిణీ చేయాలని ఆయన సిఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫోరం నాయకులు పి.సురేందర్‌రెడ్డి, రాములు, విష్ణువర్ధన్, జంగా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**మాజీ కేంద్ర మంత్రి సర్వే**

బేగంపేట జనవరి 5,ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని,పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు.శుక్రవారం బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ తాతాచారి కాలనీలో ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు కేంద్రాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా దరఖాస్తు కేంద్రంలో అందిస్తున్న సేవలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో పేదలకు జరిగిన మేలు ఏమి లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద, బడుగు, బలహీన వర్గాలకు భరోసానిచ్చే పార్టీ అన్నారు. కేంద్రాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాలైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం లో సర్వే వెంట కాంగ్రెస్ నాయకులు హౌసీటోచర్, జయపాల్, జాన్, రమగళ్ల రమాదేవి, టిఎం యాదగిరి,అరుణ్ ఉన్నారు.

## టిఎన్‌జిఓ ఉద్యోగుల క్రీడా పోటీలు



గన్‌ఫౌండ్రి,జనవరి 5(ప్రభాతవార్త: తెలంగాణ టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో రెండవ రోజు టిఎన్‌జిఓ ఉద్యోగుల క్రీడా పోటిలు జరిగాయి.ఐజి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఆర్.అండ్.బి,విద్యాశాఖ, ఈఎస్ఐ,ఐటిఐ,వాటర్ వర్క్స్,డెంటల్ కళాశాల,స్టేట్ సెంట్రల్‌లైబ్రరీ డిగ్రీ కళాశాల,ఉస్మానియా ఆసుపత్రి,ఉస్మానియా మెడికల్ కళాశాల,పబ్లిక్‌గార్డెన్స్,వక్ఫ్‌బోర్డు జట్లు క్రికెట్ ఆడాయి. ఈకార్యక్ర మంలో జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్‌కుమార్, సభ్యులు ఖాలీద్ అహ్మద్,వైదికశాస్త్రి,శ్రీధర్‌నాయుడు, ముఖీంఖురేషీ,మహ్మద్ వహిద్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సభ ఎన్నికలకు ముందే రిజర్వేషన్ల అంశం పరిష్కరించాలి

**ముదిరాజ్ ఎంప్లాయిస్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్**


**సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్ ముదిరాజ్**

హైదరాబాద్, జనవరి 5,ప్రభాతవార్త: లోక్‌సభ ఎన్నికలకు ముందే ముదిరాజ్‌ల రిజర్వేషన్ అంశం పరిష్కరించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ -ప్రొఫెషనల్స్ అసోయేషన్ (మోపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని మెపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు కేవలం ముదిరాజ్‌లను ఓట్లకోసమే వాడుకుం టున్నాయన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు ముందే ముదిరాజ్‌ల రిజర్వేషన్ అంశం తేల్చాలని ..లేదంటే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బొట్లపల్లి సంజీవన్‌కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ మెపాను అన్నిజిల్లాల్లో గ్రామస్థాయిలో బలోపేతం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దారమోని సురేష్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సందారం వెంకటయ్య, గుంటి సత్యనారాయణ, సందోళ్ల వెంకటయ్య, విజయకుమార్, దుద్యాల వెంకటయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులు నడపాలి : ఎబివిపి



**విలేకర్ల సమావేశంలో పాల్గొన్న కోఠీ జిల్లా ఎబివిపి కన్వీనర్ సభావట్ కళ్యాణ్, ప్రతినిధులు**

చార్మినార్, జనవరి 5 ప్రభాతవార్త : కళాశాల విద్యార్థులకు ప్రత్యేకంగా ఆర్‌టిసి నడిపించాలని కోఠీ జిల్లా ఎబివిపి కన్వీనర్ సభావట్ కళ్యాణ్ అన్నారు.ఎబివిపి సిటీ కళాశాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించటం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురివుతున్నారని,సమయానికి కళాశాలలకు రాలేక పోతున్నారని తెలిపారు.ప్రభుత్వం ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సులు నడిపంచాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఎబివిపి సిటీ కళాశాల అధ్యక్షులు సజన్,నగర కార్యదర్శి రాహుల్,కళాశాల కార్యదర్శి జితేందర్,జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీ కాంత్,కో కన్వీనర్ సాయి,హైమావతి,చందన, రోహిత్,ప్రశాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సింహవాహినీ అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు


**పూజ కార్యక్రమంలో పాల్గొన్న చార్మినార్ ఎసిపి రుద్రభాస్కర్**

చార్మినార్, జనవరి 5 ప్రభాతవార్త : పాతబస్తీ లాల్‌దర్వాజలోని శ్రీ సింహ వాహినీ అమ్మవారి మందిరంలో చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరం కమిటి ప్రతినిధులు ఎసిపి రుద్ర భాస్కర్‌ను శాలువ కప్పి సన్మానించారు. అన్నదానంలో వందలాదిమంది పాల్గొన్నారు.

## ఉరివేసుకుని యువకుని ఆత్మహత్య

బేగంపేట జనవరి 5,ప్రభాతవార్త : ఒక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.బేగంపేట అన్నానగర్‌లో నివసించే జి.మల్లయ్య పెద్దకుమారుడు జి.వెంకటేష్(25)మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతుండటంతో కుటుంబసభ్యులు సంవత్సరం నుంచి అతనికి చికిత్స చేయిస్తున్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుని తల్లితో కల్సి వెంకటేష్ ఇంటికి చేరుకున్నాడు.కొడుకును ఇంట్లో ఉంచిన తల్లి పనికి వెళ్లింది.తిరిగి సాయంత్రం గం 7ల సమయంలో ఇంటికి వచ్చింది.గది తలుపు లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో అనుమానంతో కిటికీ లోనుంచి చేయిపెట్టి తలుపు తీసి చూసింది.ఈ సమయంలో వెంకటేష్ చీరెతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు.తల్లి కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు అక్కడికి చేరుకున్నారు. వారు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు.సంఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్స్ సిబ్బంది వెంకటేష్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు.ఎస్సై ప్రమోద్‌కుమార్ రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.?

## రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సహాయం


**మృతిచెందిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చెక్కును అందజేస్తున్న అల్లం నారాయణ తదితరులు**

గచ్చిబౌలి, జనవరి 5 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి పరిధిలో జర్నలిస్టుగా పనిచేస్తూ గతకొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీనివాస్ కుటుంబానికి శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో 5లక్షల రూపాయల నిధులను సమకూర్చగా, శుక్రవారం టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ చేతుల మీదుగా శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు 5లక్షల రూపాయల చెక్కును అందించారు. ఈమేరకు చందానగర్ పాపిరెడ్డి కాలనీ రాజీవ్ గృహకల్పలో గల శ్రీనివాస్ ఇంటికి టియుడబ్ల్యూజె రాష్ట్ర, జిల్లా నాయకులు, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులతో కలిసి వెళ్లిన అల్లం నారాయణ శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ చనిపోయిన జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకునేందుకు శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ముందడుగు వేయడం అభినందనీయమన్నారు. గతంలో సైతం శేరిలింగంపల్లిలో పనిచేస్తున్న జర్నలిస్టులు చనిపోయిన సమయంలో వారి కుటుంబ సభ్యులకు, ఆనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టులకు సైతం ఆర్థిక సహాయం అందజేసిన శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ఆదర్శంగా నిలిచిందన్నారు. మృతిచెందిన శ్రీనివాస్ కుటుంబానికి ఇప్పటికే మీడియా ఆకాడమీ ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరిగిందని, వారి కుటుంబ సభ్యులకు పెన్షన్ సదుపాయాన్ని సైతం కల్పించామన్నారు. ప్రభుత్వం నుంచి శ్రీనివాస్ కుటుంబానికి చేరాల్సిన సంక్షేమ పథకాలను చేరవేసే విధంగా టియుడబ్ల్యూజె కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, రాష్ట్ర నాయకులు పైళ్ల విఠల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సాగర్, ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్టు జగన్‌రెడ్డి, టెంజు అధ్యక్షుడు సాగర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్‌తో పాటు ప్రెస్‌క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని అమలు చేయాలి

కంటోన్మెంట్, జనవరి 5 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన శుక్రవారం సిఎం క్యాంప్ కార్యాలయం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల చట్టాన్ని అమలు చేయడంలో రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి.బి.ఎఫ్.నాయకులు పి.శంకర్, పులి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అభయ వాస్తం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : కొత్త సంజీవరెడ్డి

కంటోన్మెంట్,జనవరి 5 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని ఆర్టీసి మాజీ చైర్మన్ కొత్త ఎసంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కంటోన్మెంట్ 6వ వార్డు తాడ్‌బంద్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ప్రజలకు సిబ్బంది సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గజ్వెల్ భరత్, స్వరూప, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### మర్రి రాజశేఖర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కంటోన్మెంట్ బిఆర్ఎస్ నేతలు


**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బిఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, చొల్లేటి రమేశ్ తదితరులు**

కంటోన్మెంట్, జనవరి 5 ప్రభాతవార్త: మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని శుక్రవారం బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కంటోన్మెంట్ బిఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, చొల్లేటి రమేశ్, ప్రవీణ్ యాదవ్, రాంమోహన్, శేఖర్ ముదిరాజ్, భాస్కర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఓఎస్‌డిని కలిసిన వాణిజ్యపన్నులశాఖ ప్రతినిధులు



బేగంబజార్,జనవరి 5ప్రభాతవార్త: తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓఎస్‌డిగా నియమితులైన తెలంగాణ స్టాంప్స్,అండ్ ఐజి రిజిస్ట్రేషన్ వేముల శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా తెలంగాణ వాణిజ్య పన్నుల నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు.ఈమేరకు ఓఎస్‌డిగా నియమితులైన వేముల శ్రీనివాస్‌కు అసోసియేషన్ అధ్యక్షులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శి రహమత్‌అలీ,అసోసియేట్ అధ్యక్షులు హరి ప్రసాద్,కోశాధికారి దేవులపల్లి శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులు ఎం.మధు బొకె అందచేశారు.

## జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.శ్రీనివాసరావు



కుత్బుల్లాపూర్, జనవరి 5 ప్రభాతవార్త : జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.శ్రీనివాసరావు పదవీ బాధ్యతలు చేపట్టారు. మాదాపూర్ సి.సి.ఎస్ లో సర్కిల్‌ఇన్‌స్పెక్టర్‌గా వున్న పి.శ్రీనివాసరావు జీడిమెట్ల లా ఆండ్ ఆర్డర్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించగా జీడిమెట్ల లో ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన పవన్ శంషాబాద్ సి.సి.ఎస్‌కు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా నూతనంగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు సబ్‌ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది స్వాగతం పలికారు.

## ఎమ్మెల్యే మాగంటిని కలిసిన రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు



యూసుఫ్‌గూడ, జనవరి 5, ప్రభాతవార్త : గుర్తింపు పొందిన పాఠశాలల సమస్యల పరిష్కారానికి తగిన విధంగా కృషి చేస్తానని హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, జూబ్లీహిల్స్ శాసనసభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. శుక్రవారం శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా అసోసియేషన్ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అగస్టీన్ ఉమా మహేశ్వర్‌రావు, కుత్బుద్దీన్, ఎన్.విజయ్‌కుమార్, శ్రీకాంత్, సుధాకర్, రమణ, గోపాల్‌రావు, దస్తగిరి అంజనారావు పాల్గొన్నారు.

## కమర్షియల్ సిలెండర్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చార్మినార్,జనవరి 5 ప్రభాతవార్త : నిబంధనలకు విరుద్ధంగా ఇంటో ్ల కమర్షియల్ గ్యాస్ సిలెండర్లు పెట్టుకుని అమ్ముతున్న ఓ వ్యక్తిని హుస్సేనీఆలం పోలీసులు అరెస్ట్ చేశారు.అతని వద్ద నుంచి ఎనిమిది కమర్షియల్ సిలెండర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్ కథనం ప్రకారం.. గులాబ్‌సింగ్‌బౌలి ప్రాంతానికి చెందిన సతీష్ (40) ఇంట్లో కమర్షియల్ గ్యాస్ సిలెండర్లు అమ్ము తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి జరిపి అతని వద్ద నుంచి 8సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. సతీష్‌పై కేసు నమోదు చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## అనుమతిలేని సెల్లార్ పనుల నిపివేత


**సెల్లార్‌లో నిర్మాణ పనుల్ని తొలగిస్తున్న ఏసీపీ సుస్మిత, టీపీఎస్‌సోమేశ్వర్**

కూకట్‌పల్లి, జనవరి 5 ప్రభాతవార్త: కూకట్‌పల్లి సర్కిల్ హైదర్‌నగర్ డివిజన్ శాతవాహననగర్ ప్లాట్ నెంబర్ 197లో ఎలాంటి అనుమతులు లేనప్పటికీ కొనసాగుతున్న సెల్లార్ పనుల్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు. సెల్లార్ పనులు జరుగుతున్నాయనే విషయం తెలిసిన వెంటనే కూకట్‌పల్లి సర్కిల్ 24 ఏసీపీ సుస్మిత, టీపీఎస్ సోమేశ్వర్‌తోపాటు మున్సిపల్ సిబ్బంది వెళ్ళి సెల్లార్ నిర్మాణ పనుల్ని తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లలో ఎలాంటి కట్టడాలు నిర్మించినా తొలగిస్తామన్నారు. అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలి

హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త: హిమాయత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో డ్రైనేజీ, మంచినీటి సమస్యలపై డివిజన్ కార్పోరేటర్ గడ్డం మహాలక్ష్మీరామన్‌గౌడ్ శుక్రవారం నారాయణగూడలోని వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ రామకృష్ణ, డిజిఎం సన్యాసిరావులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కింగ్‌కోఠిలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా, హిమాయత్‌నగర్‌లని వై జంక్షన్‌లో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నాయని వెంటనే బాగు చేయాలని కోరారు. అలాగే విఠల్‌వాడిలో శాంక్షన్ అయిన పనులను, హిమాయత్‌నగర్‌లోని స్ట్రీట్ నెంబరు 9లో వాటర్ వర్క్స్‌ను పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు రామన్‌గౌడ్, పడాల శ్రీనివాస్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యువ కవయిత్రులకు వచనకవిత అధ్యయన శిబిరం

నాంపల్లి, జనవరి 5 ప్రభాతవార్త : తెలంగాణ సారస్వత పరిషత్తు ఇటీవల నిర్వహించిన యువ రచయిత్రుల సమ్మేళనానికి కొనసాగింపుగా వచ్చేనెల ఫిబ్రవరి 11వ తేదీన యువ కవయిత్రులకు వచన కవిత్వంలో అధ్యయన శిబిరం నిర్వహించాలని నిర్ణయించినట్లు పరిషత్తు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, డా. జుర్రు చెన్నయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ బొగ్గులకుంట తిలక్‌రోడ్‌లోని సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఉదయం 9నుండి సాయంత్రం 5.30గంటల వరకు సాగే ఈ శిబిరంలో కవిత్వ భాషాశైలి, శీర్షిక, వస్తువు, శిల్పం, ఎత్తుగడ, నిర్వహణ, ముగింపు మొదలైన అంశాలపై ప్రముఖ కవులు, విమర్శకులు శిక్షణ ఇస్తారని, యువ రచయిత్రుల సమ్మేళనంలో పాల్గొన్న కవయిత్రుల్లో 50మందిని వారి కవితల ఆధారంగా ఎంపిక చేసినట్లు, ఇంకా ఎవరైనా ఔత్సాహికులు పాల్గొనదలిస్తే ఇటీవల వారు వ్రాసిన స్వీయ కవితను, ఇతర తమ వివరాలతో దరఖాస్తు పంపితే పరిశీలించి ఎంపిక చేస్తామన్నారు.

## ప్రతిభతో ఏదైనా సాధించవచ్చు: నటి లక్ష్మి మంచు


**జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంటులలో అవార్డులు సాధించిన పారా అథ్లెట్లతో ముఖ్య అతిథి నటి,నిర్మాత మంచులక్ష్మి, ఏఎంఎఫ్‌ట్రస్టీ ఫాస్ట్ మిసెస్ ఇండియా ఎంటర్ పెన్యూర్ శిల్పారెడ్డి**

బేగంపేట జనవరి 5,ప్రభాతవార్త : ప్రతిభ ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని,వారికి అంగ వైకల్యం అనేది ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డు రాదని పారా అథ్లెట్లు మరోసారి నిరూపించారని నటి,నిర్మాత లక్ష్మీ మంచు అన్నారు.ఆదిత్యా మెహతా ఫౌండేషన్ ,జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రసూల్ పురా లోని ఆదిత్యా మెహతా ఫౌండేషన్‌లో ముఖ్య అతిథిగా హాజరైన నటి లక్ష్మీ మంచు పారా అథ్లెట్లను సత్కరించారు. ఇటీవల జరిగిన వరల్డ్ ఎబిలిటీ గేమ్స్ వంటి అంతర్జాతీయ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు,ఆసియా క్రీడల్లో పాల్గొని పారాలింపిక్స్ 2024కు అర్హత సాధించిన క్రీడాకారులకు సత్కారం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నటి, నిర్మాత,లక్ష్మీ మంచు, ఏఎంఎఫ్‌ట్రస్టీ ఫాస్ట్ మిసెస్ ఇండియా ఎంటర్ పెన్యూర్ శిల్పారెడ్డి,ఎన్ఎండీసీ ఛైర్మన్ అమితన్ ముఖర్జీ,కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్,జేఎన్‌వీ సౌత్ రీజియన్ హెడ్ డిప్యూటీ కమీషనర్ గోపాల్‌కృష్ణ,ఏఎంఎఫ్ ఫౌండర్ ఆదిత్యమెహతా తదితరులు పాల్గొన్నారు.జావెలిన్ లో కాంస్యం తో పాటు డిస్కస్ త్రో,షాట్‌పుట్‌లో జ్యోతి(15) రజత పతకం గెల్చుకున్నారు.ప్రశాంత్ హ్యాండ్ సైక్లింగ్‌లో కాంస్యం సాధించారు.డిస్కస్‌త్రోలో వేణు స్వర్ణపతకం కైవసం చేసుకున్నారు.

## నేడు నాచారం డీపీఎస్ క్యాంపస్‌లో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం

నాచారం, జనవరి 5 ప్రభాతవార్త: నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ క్యాంపస్‌లో శనివారం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకను ఘనంగా నిర్వహిస్తున్నట్లు డీపీఎస్, పల్లవి స్కూల్స్ చైర్మన్ మల్కాకొమురయ్య,ఏలైట్ ఇన్ఫో టెక్నాలజీ సంస్థ డైరెక్టర్ గోనే శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ శ్రీశ్రీత్రిదండి శ్రీ రామానుజ చినజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు వెల్లడించారు. సాయంత్రం 3.30కు జరుగనున్న శ్రీరామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవానికి ప్రజలు పాల్గొని విజయవంతం చేసి తీర్థప్రసాదాలు తీసుకొని వెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, రాజ్యసభసభ్యుడు డా.కె.లక్ష్మణ్ హాజరుకానున్నట్లు చెప్పారు.

## తాళ్లగడ్డలో శాస్త్రోక్తంగా సాగుతున్న "బొడ్రాయి" పూజలు

**పెద్ద ఎత్తున పాల్గొన్న స్థానిక ప్రజలు**


**తాళ్లగడ్డలో శాస్త్రోక్తంగా జరుగుతున్న బొడ్రాయి నాభిశీల ప్రతిష్ట పూజలలో పాల్గొన్న భక్తజనులు**

మెహిదీపట్నం, జనవరి 5 ప్రభాతవార్త : కార్వాన్‌లోని తాళ్లగడ్డలో వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా "బొడ్రాయి" నాభిశీల ప్రతిష్టా పూజలు జరుగుతున్నా యి. పండితులు అవధూత శర్మ, హరిహర శర్మల ఆధ్వర్యంలో ఈనెల 4.వ,తేదీ సాయంత్రం బొడ్రాయి నాభిశీలను మహిమాన్విత దర్బార్ మైసమ్మ ఆలయం నుంచి తోట్ల పోచమ్మ ఆలయం వరకు భారీ భక్తజనుల జయ జయ ధ్వనుల మధ్య ఊరేగింపు నిర్వహించారు. 5.వ,తేదీన ఉదయం 9.గంటలకు గణపతి పూజ, పుణ్యాహావచనం, అఖండ దీపారాధన, కంకణ దీక్షధారణం, ప్రధాన కలశం, వాస్తు యోగిని క్షేత్ర పాలక, అగ్ని ప్రతిష్ట, లక్షణోద్ధారణ, పర్యగ్నికరణ, జలాధివాసము, ధాన్యాదివాసము, శాలార్జన, హోమం, నీరాజనం, మంత్రపుష్పము, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ నెల 7.వ,తేదీ వరకు ఈ బొడ్రాయి పూజలు జరుగుతాయని వేద పండితులు వివరించారు. ఈ వేడుకలలో అధ్యక్షులు ఆకుల రాజగోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నారెడ్డి దుర్గా దాస్ యాదవ్, తాళ్లగడ్డ యూత్ అసోసియేషన్ సభ్యులు,పుర ప్రముఖులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దేవాలయ భూముల కబ్జాలను అడ్డుకోవాలి


**ఖానాపూర్ సర్వే నెంబర్ 65.లో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయ భూమిలో కబ్జాలు అడ్డుకోవాలిన తహసీల్దార్‌కు వినతి**

నార్సింగి, జనవరి 5 ప్రభాతవార్త : గండిపేట మండలం ఖానాపూర్ గ్రామ సర్వే నెంబర్ 65.లో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయ భూమిలో జరుగుతున్న కబ్జాలను అడ్డుకోవాలని కోరుతూ ఖానాపూర్ ప్రజలు తహసీల్దార్ గోవర్ధన్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ శతాబ్దాల కాలంగా ఆంజనేయ స్వామి దేవాలయం ఉందని, దానికి కేటాయించిన భూములున్నాయన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు కొద్ది కొద్దిగా రేకుల షెడ్లు వేసుకుంటూ ఆలయ భూములను కబ్జా చేస్తున్నారని, పలుమార్లు అడ్డుకున్నామని వివరించారు. ఆలయ భూములలో కబ్జాలు జరుగుతున్న విషయం తెలుసుకున్న ఖానాపూర్ గ్రామ పెద్దలు, యువకులు, హిందూ ధార్మిక సంఘాలు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి వచ్చి కబ్జాలు తొలగించాని ఆందోళన చేశారన్నారు. వెంటనే కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఆలయ భూములను పరిరక్షించాలని తహసీల్దార్ గోవర్ధన్‌కు విన్నవంచామన్నారు. ఖానాపూర్ గ్రామస్థుల వినతిపత్రం అందుకున్న తహసీల్దార్ ఆ భూమి ఆలయానికి వస్తుందా? ఇతరులకు వర్తిస్తుందా? పరిశీలించి, చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో ఖానాపూర్ పుర ప్రముఖులు, హిందూ సంఘాల ప్రతినిధులు మన్నె విఠలయ్య, కన్నయ్యగారి వెంకటేష్, దుద్దాల లక్ష్మీనారాయణ, దుద్దాల రాజు, మాచెర్ల రాజు, విఠల్‌రెడ్డి, తోట్‌కట్ట కృష్ణ, ప్రశాంత్ యాదవ్, మెండె నాగేష్, చిక్కిరి బిక్షపతి యాదవ్, మన్నె సురేష్, నరేష్, ఉపేందర్, రఘుపతి, రవి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్ తదితరులు ఉన్నారు.

## ప్రజాపాలన అభయహస్తం కోసం ధరఖాస్తు చేసుకోండి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ధరఖాస్తులను తీసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పోరేటర్ శాంతి శేఖర్

**నాచారం, జనవరి 5 ప్రభాతవార్త:** ప్రజాపాలన అభయహస్తం పథకాల కోసం నేడు చివరి రోజు కావడంతో అబ్దిదారులు వెంటనే ధరఖాస్తూ చేసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. నాచారం అన్నపూర్ణకాలనీలో ఏర్పాటు చేసిన అభయహస్తం కేంద్రాన్ని కార్పోరేటర్ సాయిజన్ శాంతిశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యవేక్షించి ప్రజలకు ధరఖాస్తు ఫారాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం చివరి రోజు కావడంతో ప్రజల కోసం ప్రత్యేకంగా కార్తికేయనగర్ రీడింగ్ రూమ్, హెచ్‌ఎంటీనగర్ రీడింగ్ రూమ్‌లలో ప్రజాపాలన అభయహస్తం కోసం ధరఖాస్తు ఫారాలను తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్, ప్రీతిరెడ్డి, రమేష్‌గౌడ్, కట్ట బుచ్చన్నగౌడ్, లడ్డు, శివ, అషు, దేవులపల్లి యాదగిరి, స్వామి, అర్జున్ తధితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు



అక్షింతలను అందిస్తున్న ఆర్‌ఎస్ఎస్‌నాయకులు, రామభక్తులు

**హయత్‌నగర్, జనవరి 5 ప్రభాతవార్త:** అయోధ్య రామజన్మభూమి తీర్థట్రస్ట్ వారు అందిస్తున్న గడపగడపకు రామజన్మభూమి అక్షింతల వితరణ కార్యక్రమం పెద్దఅంబర్‌పేటమున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులలో ఆర్‌ఎస్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, ఆయా కాలనీల ప్రతినిధులు అక్షింతలను ఇంటింటికీ చేరేలా కార్యక్రమాలను కొనసాగించారు. సన్నాయి మేళాలతో రామనామ స్మరణతో భజనలు చేసుకుంటూ ఇంటింటికీ తిరిగి అక్షితల వితరణ చేశారు.

## చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

**హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త:** విద్యార్థులు చదువుపట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఇస్రో సైంటిస్ట్ శివశంకర్ పేర్కొన్నారు. ఆర్కేపురం భాష్యం హైస్కూల్ 13వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. చంద్రయాన్ 2 సంబంధించి పలు అంశాల గురించి ఆయన వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. పాఠశాల జెడ్‌ఈవో అంకమ్మరావు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని విషయాల పట్ల అవగాహన పెంపొందించుకొని పోటీ ప్రపంచంలో దూసుకుపోవాలని అన్నారు. చదువుతోపాటు సామాజికపరమైన అంశాలపై కూడా విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆహుతులను అబ్బురపరిచారు. వివిధ పోటీలలో గెలుపొందినవిద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ అనుపమ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ : మైనంపల్లి



ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మైనంపల్లి తదితరులు

**మల్కాజిగిరి, జనవరి 5 ప్రభాతవార్త:** గౌతమ్‌నగర్‌డివిజన్ హిల్‌టాప్‌కాలనీలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు పోచమ్మ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచమ్మ ఆలయ నిర్మాణాన్ని తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, జిఎన్‌వి సతీష్ కుమార్, కన్నెమల్ల నాగరాజు, రాంచందర్, సంతోష్ రాందాస్, వైనాల ప్రవీణ్, జీడీ సంపత్‌గౌడ్, వినోద్‌యాదవ్, బాల్‌రాజ్ యాదవ్, ప్రసాద్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, అంజయ్య, లక్ష్మి, రాము తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడిగా చేగూరి వెంకటరమణ



వెంకటరమణను అభినందిస్తున్న రాజేశ్వర్, వినోద్‌కుమార్, రమేష్‌గుప్త

**మలక్‌పేట, జనవరి 5 ప్రభాతవార్త:** తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడిగా మలక్‌పేట మహబూబ్‌మాన్షన్ మార్కెట్‌కు చెందిన వ్యాపారవేత్త చేగూరి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మార్కెట్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వెంకటరమణను వ్యాపారస్తులు ఛాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటరమణకు వ్యాపారస్తులు పుష్పగుచ్చాలను అందజేసి శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా పలు సంవత్సరాలనుండి ఆనియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ వ్యాపారస్తులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా రైతులకు మంచి గిట్టుబాటు ధరను అందించడానికి తోడ్పాటు అందిస్తామన్నారు. అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి సహకరించిన వ్యాపారస్తులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు దేవరరాజేశవర్, తేలుకుంట్ల రమేష్‌గుప్తా, మిర్చి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వంజరి వినోద్‌కుమార్, వ్యాపారస్తులు సత్యలింగం, ఉమాశ్రీనివాస్, ఎం.కృష్ణ, బట్కిరి వివేకానంద్, కట్టా మల్లేశం, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైల రవికాంత్, వెంకటేష్, ఆంజనేయులు, రాజు మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డిల హాజరు



పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సబిత

**సరూర్‌నగర్, జనవరి 5 ప్రభాత వార్త:** నగరంలోని తెలంగాణభవన్‌లో శుక్రవారం జరిగిన చేవెళ్ళ పార్లమెంట్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సమావేశానికి మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గ శాసనసభ్యురాలు, మాజీమంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ జాతీయ మీడియా అధికార ప్రతినిధి కార్తీక్‌రెడ్డిలు హాజరయ్యారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా నిర్వహించిన ఈ కీలక సమావేశానికి వారు హాజరయ్యారు. మాజీ మంత్రి, పార్టీ కీలక నాయకుడు తన్నీరు హరీష్‌రావు, కె.కేశవరావు, కడియం శ్రీహరి, పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, స్థానిక ఎంపి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీలు, ముఖ్య నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో వారు ప్రసంగించారు.

## కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన జయసింహకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సత్కారం



జయసింహగౌడ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త:** సిమ్‌లయన్ పిట్‌నెస్ వ్యవస్థాపకుడు కె.జయ సింహగౌడ్ ఆఫ్రికాలోని టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి సత్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన జయసింహగౌడ్ అభినందనీయుడని అన్నారు. దేశంలో యువత పిట్‌నెస్‌లను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం క్యాలెండర్ అవిష్కరణ



పద్మశాలి సంఘం క్యాలెండర్ అవిష్కరిస్తున్న జ్యోష్ణ నాగేశ్వర్‌రావు తదితరులు

**హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త:** రామంతాపూర్ పద్మశాలిసంఘం క్యాలెండర్‌ను శుక్రవారం మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ నాగేశ్వర్‌రావు అవిష్కరించారు. ఈ మేరకు పద్మశాలి సంఘం భవనంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చిక్క సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గుండ్ల రవీంద్ర కుమార్, కోశాధికారి గజం మురళీ, పద్మశాలి సంఘం సమన్వయ కమిటి అధ్యక్షుడు పి.వి.రామనర్సయ్య తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్త సంవత్సరం క్యాలెండర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పద్మశాలి సంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. పద్మశాలి భవనం సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చాలని, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు కత్తుల సుదర్శన్, గంటి వెంకన్న, బిక్షమయ్య, చెన్న వీరేశం, సంగం వేణు పలువురు పద్మశాలి సంఘం నేతలు పాల్గొన్నారు.

## చెత్త డంపింగ్‌ను నివారించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్, కాలనీవాసులు

**హయత్‌నగర్, జనవరి 5 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని 7వ వార్డు అంబికానగర్, మునుగనూర్ వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా చెత్తడంపింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కౌన్సిలర్ కృష్ణారెడ్డితో కలిసి కాలనీవాసులు కమిషనర్ రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపక్కన చెత్తను డంపింగ్ చేయడం వల్ల దుర్గంధం వ్యాపిస్తోందని, పందుల సంచారం ఎక్కువై పోతోందన్నారు. దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. చెత్త డంపింగ్‌ను నివారించాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ చెత్త డంపింగ్‌ను నివారిస్తామని హామీనిచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కాలనీ అధ్యక్షుడు బుర్ర వెంకటరాములు, కార్యదర్శి చెట్టుపల్లి చంటి, వెంకటేష్, భద్రయ్య, మురళి పాల్గొన్నారు.

## మాతృశ్రీ 'ఉన్నతి'కి విధ్యార్థుల స్పందన




విధ్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు

**సైదాబాద్, జనవరి 5 ప్రభాతవార్త:** సైదాబాద్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం 'ఉన్నతి' పేరిట నిర్వహించిన హైయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్2కె24కు విధ్యార్థులనుంచి విశేషస్పందన లభించింది. ఎం.ఇ.సి.ఎస్, ఎం.వి.ఎస్.ఆర్.ఇ.సి కళాశాలలకు చెందిన దాదాపు 1000కి పైగా విధ్యార్థులు ఉన్నతిలో పాల్గొన్నారు. ఇంజనీరింగ్ తర్వాత ఉన్నత విద్యావకాశాలు, విదేశాలలో ఉన్నత విద్యావకాశాలు, అక్కడి అడ్మిషన్ టెస్టుల వివరాలు వంటి వాటి గురించిన విధ్యార్థుల సందేహాలకు సవివరంగా సమాధానాలు తెలియజేశారు. కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.పి.శ్రీనివాస్ రావు, కార్యదర్శి ఎం.కృష్ణకుమార్, కోశాధికారి జూపూడి సుధాకర్, ఎంఇసిఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రకుంటలో సమస్యల పరిశీలన : కెఎల్‌ఆర్



సమస్యలను పరిష్కరించాలని ఫోన్‌లో అధికారులకు సూచిస్తున్న కెఎల్‌ఆర్

**సరూర్‌నగర్, జనవరి 5 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఎర్రకుంటలో స్థానిక బస్తీవాసులకు ఇబ్బందికరంగా మారిన డ్రైనేజీ, రోడ్ల సమస్యలను వెంటనే తీర్చాలని నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మున్సిపాలిటీ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన ఎర్రకుంటలోని బస్తీల్లో కాంగ్రెస్‌కు చెందిన మైనారిటీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పలువురు బస్తీ ప్రజలు వివరించారు. ఈ మేరకు స్పందించిన ఆయన వెంటనే జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులకు ఫోన్‌చేసి సంబంధిత సమస్యలను వివరించి వాటిని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అయితే కెఎల్‌ఆర్ సూచనలకు స్పందించిన మున్సిపల్ అధికారులు తాత్కాలిక మరమ్మతు పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లిమున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అహ్మద్ బామ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల గడువును పెంచాలి : రాములుయాదవ్

**హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తుల గడువును పెంచాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి బి.రాములుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ 2024ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములుయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది పేదలు సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు అర్హులుగా ఉన్నారని, వీరంతా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకునేందుకు మరింత గడువు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రైతుబంధు ఐదు ఎకరాలకే పరిమితం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నూతన ప్రభుత్వం రైతుబంధు సాయం కింద ఒక ఎకరానికి నిధులు ఇచ్చిందని, ఇంకా నాలుగు ఎకరాల వరకు డబ్బులు రైతుల అకౌంట్లలో జమ చేయాలని కోరారు. రేషన్ కార్డులు లేకున్నా అర్హులకు ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాదిమంది పేదలు రేషన్ కార్డుల మంజూరు కోసం ఎదురుచూస్తున్నారని, వీరందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌బీ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ శివలింగం ఉపాధ్యక్షులు పి.మల్లేష్‌యాదవ్. నాయకులు దార్ల రాజు స్వామి. సిద్దు, భీమ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి: పవన్

**హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త:** సత్యనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. సత్యనగర్ కాలనీ పోచమ్మ ఆలయం సమీపంలో డ్రైనేజ్ ఇబ్బందిగా ఉండడంతో జలమండలి అధికారులు మరమ్మతులు చేపట్టి, సగంలోనే పనులు ఆపేయడంతో డ్రైనేజీ నీళ్లు నిలిచిపోతున్నాయని, అపార్ట్మెంట్‌లోకి మొరుగునీరు వస్తున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ వెంటనే అక్కడికి చేరుకొని డ్రైనేజ్ సమస్యను పరిశీలించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి జీఎం బలరాంతో మాట్లాడారు. చాలా రోజులుగా డ్రైనేజ్ మరమ్మత్తులు సగంలోనే ఆపేయడంతో డ్రైనేజీ నీళ్లు కాలనీలో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిశీలించి మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలియజేశారు. ఈ పర్యటనలో కాలనీ అధ్యక్షుడు శుక్లా, రవీందర్‌రావు, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

**హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త:** రామంతాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రామంతాపూర్ రజక సంఘం కమ్యూనిటిహాల్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాకలి ఐలమ్మ జీవితం దేశానికి ఆదర్శనీయమన్నారు. ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి లింగమయ్య, రజక సంఘం నేతలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మహిళా నేత కల్పనా గాయత్రి

**హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త:** వైఎస్ఆర్‌టిపి గ్రేటర్ కోఆర్డినేటర్ కల్పనా గాయత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు డిల్లీలోని కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యదర్శి కెసి వేణుగోపాల్, తెలంగాణ ఇంచార్జ్ మాణిక్‌రావుఠాక్రే, మున్షి, రుద్రరాజు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఆమట్లాడుతూ వైఎస్ఆర్‌టిపి పార్టీ అధినేత్రి షర్మిల పార్టీలో కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడంతో తాము కూడా కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ ఓటమి లక్ష్యంగా ప్రజాపాలన పునరుద్దరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని, తనకు ఎలాంటి బాధ్యత అప్పగించినా పార్టీ గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు.

## మీర్‌పేట్ పెద్ద చెరువు కట్టను ఆక్రమించి నిర్మిస్తున్న ఇంటి నిర్మాణంపై చర్యలకు వినతి



కార్పొరేటర్ ఆధ్వర్యంలో టిపిఓకు ఫిర్యాదు చేస్తున్న టిఎస్ఆర్ కాలనీవాసులు

**సరూర్‌నగర్, జనవరి 5 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ 28వ డివిజన్ టిఎస్ఆర్ కాలనీలో మీర్‌పేట్ పెద్ద చెరువు కట్టను ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని టిఎస్ఆర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈమేరకు డివిజన్ కార్పొరేటర్ జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు, కాలనీవాసులు కార్పొరేషన్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో టిపిఓ దేవానంద్‌ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ ప్రైవేటు వ్యక్తి తనకున్న 147గజాలలోని పాత ఇంటిని కూల్చి ఆ స్థలంలో నూతనంగా ఇంటిని నిర్మించే క్రమంలో ప్లాటుకు ఆనుకొని ఉన్న పెద్ద చెరువు భూమిని దాదాపు 100 గజాల వరకు ఆక్రమించి నిర్మాణం సాగిస్తున్నాడని వివరించారు. ఈ విషయమై కార్పొరేషన్‌లో ఇది వరకే ఫిర్యాదు చేయడంతో అప్పట్లో కార్పొరేషన్ అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని నోటీసులు జారీ చేసినా సదరు నిర్మాణదారుడు కొందరు బడా నాయకులు అండతో ఇంటి నిర్మాణాన్ని యధేచ్ఛగా కొనసాగిస్తున్నాడని వారు తెలిపారు. అంతే కాకుండా ఎవరొస్తారో చూద్దాం అంటూ బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో తక్షణమే సదరు నిర్మాణాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణదారునిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కాలనీ అధ్యక్షుడు జిల్లెల ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, మాధవి శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు రాజుగౌడ్, మదనాచారి, చంద్రికా దేశ్‌పాండే, కాలనీవాసులు శేషగిరిరావు, ఉమ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడానికి ప్రత్యేక చర్యలు : రాచకొండ సిపి సుధీర్‌బాబు



స్మైల్ సమన్వయ సమావేశంలో పాల్గొన్న రాచకొండ సిపి సుధీర్ బాబు

**నేరెడ్‌మెట్, జనవరి 5 ప్రభాతవార్త:** పిల్లల బాల్యాన్ని చిదిమివేస్తున్న బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించడానికి తమవంతు కర్తవ్యం నిర్వర్తించాలని రాచకొండ పోలీస్ కమీషనర్ పిలుపునిచ్చారు. శుక్రవారం నేరెడ్‌మెట్ వాయుపురిలోని రాచకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో స్మైల్ పదవ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలకార్మిక వ్యవస్థ వ్యాధిలాగ ప్రబలిందని, వెట్టిచాకిరి చేస్తూ తమ బంగారు బాల్యాన్ని అంధకారంలోకి నెడుతున్నారన్నారు. పిల్లల చదువుకోసం ప్రభుత్వం ఉచితంగా ఎన్నో కార్యక్రమాలు చేస్తుందని వాటిని చిన్నపిల్లల తల్లిదండ్రులు తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇతర ప్రాంతాల నుండి ఇటుక బట్టీల వద్ద పనిచేయడానికి వచ్చిన కూలీల కుటుంబాల చిన్నారులు విద్యకు దూరం కాకుండా వారి ప్రాంతాల్లోనే వర్క్ సైట్ పాఠశాలలను నడపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసిపి ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, ఏసిపి వెంకటేశం, రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖాధికారి శ్రీ క్రిష్ణారెడ్డి, జిల్లా సిడబ్ల్యూసీ చైర్మన్ నరేంద్ర, మేడ్చల్ సీడబ్ల్యుసీ చైర్మన్ రాజారెడ్డి, డిప్యూటీ వైద్యాధికారి గీత, డీసిపివోలు ప్రవీణ్, ఇంతి యాజ్, సైదులు, బాలరక్ష భవన్ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ అండాళ్ నిలయంలో ప్రత్యేక పూజలు



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులు

**మలక్‌పేట, జనవరి 5 ప్రభాతవార్త :** మూసారాంబాగ్‌లోని అండాళ్ నిలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మాతృశ్రీ రిందాదేవి తిరునక్షత్రం సందర్భంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వాహకురాలు ఎ.లక్ష్మీదేవి, రూపాదేవి, రామకృష్ణల ఆధ్వర్యంలో నిత్యం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం రిందా శరణ్య నాట్యమండలి శ్రీమతి యశోద బృందంతో నాట్య ప్రదర్శన, 9వతేదీ మంగళవారం ఆండాళ్‌నిలయంలో దీపోత్సవం, 12వ తేదీన ఆండాళ్ తల్లికి నీరాటోత్సవం, అనంతరం 108వెండి గంగాళ ములతో అక్కార వడిశల్ విశేష ప్రసాద నివేదన, వితరణ, 14వ తేదీ ఆదివారం బోగి పండుగ, ఉదయం10.30గంటలకు గోదా కళ్యాణం ప్రారంభం, సాయంత్రం తిరుప్పావై ఫలశృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యమ్రాలను విజయవంతం చేయాలని కోరారు.

## నాగార్జునకాలనీలో గడపగడపకు అయోధ్య శ్రీరామ అక్షింతల వితరణ



శ్రీరామ అక్షింతల వితరణ కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు

**వనస్థలిపురం, జనవరి 5 ప్రభాతవార్త:** వనస్థలిపురండివిజన్ నాగార్జున కాలనీలో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ వారు అందిస్తున్న గడపగడపకు శ్రీరామజన్మభూమి యొక్క అక్షింతల వితరణ కార్యక్రమంలో కాలనీవాసులు, రామ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్య శ్రీరాముడి అక్షింతలతో పాటు రామ్‌లీలా చిత్రపటం, ఆహ్వాన పత్రిక పంపిణి పంపిణి వితరణ కార్యక్రమం ప్ర ఇంటికి చేరేవిధంగా ప్రణాళిక చేపట్టి భక్తులందరికీ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మహిళలు బాల రామునికి మంగళహారతులతోపాటు కొబ్బరికాయలు కొట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లట్టుపల్లి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నాయిని శ్రీకాంత్‌రెడ్డి, సభ్యులు గంగాపురం హనుమంత్‌రెడ్డి, రాష్ట్రీయ స్వయం సేవక్ నాయకులు శామసుందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అమరవర్ధన్‌రెడ్డి, ఆమనిగంటి వెంగల్‌రెడ్డి, దాసోజు దయాకర్, చంద్రారెడ్డి, ఎం.లక్ష్మణ్, మొద్దు కరుణాకర్ రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ఎ.చంద్రరెడ్డి, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు

**శ్రీరాముని పాదుకలను తాకడం మా అదృష్టం...** అయోధ్య శ్రీరాముని మందిరానికి శ్రీరాముడి బంగారు పాదుకలను తయారుచేసిన బ్రహ్మశ్రీ పిట్టంపల్లి రామలింగాచారిని వారి నివాసంలో తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రఅధ్యక్షులు బ్రహ్మశ్రీ వింజమూరు రాఘవాచారి, రాష్ట్ర కార్యదర్శి రాగిఫణి సతీష్‌చారి, పోతులూరిచారి, సంతోష్‌చారి వారిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాముని పాదుకలను తాకడం మా అదృష్టంగా భావిస్తున్నామని వారు పేర్కొన్నారు.

## పండుగలు సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి : ఎమ్మెల్యే బలాల



ఎమ్మెల్యే బలాలను ఆహ్వానిస్తున్న ప్రభుచరణ్

**మలక్‌పేట, జనవరి 5 ప్రభాతవార్త:** పండుగలు సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో ఈ నెల 7వ తేదీ ఆదివారం నిర్వహించనున్న క్రిస్మస్, న్యూ ఇయర్ ఫిస్ట్ కార్యక్రమాలకు విచ్చేయాలని చర్చి ఫౌండర్ ప్రభుచరణ్ ఎమ్మెల్యే బలాలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. క్రైస్తవులకు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాస్టర్ వన్య ఇమ్మాన్యూయేల్ తదితరులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ న్యాయకళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గంగుల గోవర్ధన్‌రెడ్డి సతీమణి మాజీ ఫిల్మ్ సెన్సార్‌బోర్డ్ మెంబర్ గంగుల అరుణరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగుల నవ్యరెడ్డి, నాయకులు గణేష్‌నేత, చిలుక ఉపేందర్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, ధనరాజ్‌గౌడ్, బొక్క భూపాల్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. (హైదరాబాద్, ప్రభాతవార్త)